సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం, 16, ఆగస్టు, 2024





## పోలీసుల అత్యుత్సాహం

పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. కూటమి ప్రజాప్రతినిధుల కాన్వాయ్ కోసం అంబులెన్స్‌ను ఆపేసి వారి సేవలో తరించారు. 8లో




## నేటి నుంచి జూడాల సమ్మె

కేజీహెచ్‌లో శుక్రవారం నుంచి జూనియర్ వైద్యులు సమ్మె చేయనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ తెలిపారు. 8లో



ఢిల్లీలో జాతీయ స్థాయి ప్రతిభా పురస్కారం అందుకున్న సబ్బవరం మండలం మల్లు నాయుడుపాలెం అంగన్‌వాడీ కార్యకర్త రావిపల్లి రమణమ్మ

## న్యూస్‌రీల్

### సుప్రీంకోర్టు న్యాయమూర్తికి ఆత్మీయ స్వాగతం



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జె.కె.మహేశ్వరి

**గోపాలపట్నం:** సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె.మహేశ్వరికి విశాఖ విమానాశ్రయంలో ఆత్మీయ స్వాగతం లభించింది. విశాఖలో మూడు రోజుల పర్యటనలో భాగంగా గురువారం ఢిల్లీ నుంచి విశాఖ చేరుకున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, జాయింట్ పోలీస్ కమిషనర్ కె.ఫకీరప్ప, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు గోపి, సాయి కల్యాణ చక్రవర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జిల్లాకు చెందిన పలువురు న్యాయమూర్తులు ఆయనకు స్వాగతం పలికారు.

### నగర పోలీస్ కమిషనర్‌కు ప్రెసిడెంట్ పోలీస్ మెడల్



సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పీపీఎంను అందుకుంటున్న సీపీ శంఖబ్రత బాగ్చి

**విశాఖ సిటీ:** నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రతిష్టాత్మక ప్రెసిడెంట్ పోలీస్ మెడల్(పీపీఎం)ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేతుల మీదుగా అందుకున్నారు. 2023లో రాష్ట్ర శాంతి భద్రతల విభాగ అదనపు డీజీగా పనిచేస్తూ విశిష్ట సేవలు అందించడంతో పీపీఎంకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గురువారం జరిగిన 78 వ స్వాతంత్ర్య దినోత్సవంలో ఈ మెడల్‌ను సీపీ అందుకున్నారు. 2022, 2023లో క్రైం విభాగంలో అత్యుత్తమ సేవలకు గానూ ఎస్‌ఐ డి.సూరిబాబు(2239) ఐపీఎం మెడల్‌ను సీఎం చేతుల మీదుగా స్వీకరించారు.

### విశాఖ చేరుకున్న రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి

**మహారాణిపేట:** రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(రెవెన్యూ, రిజిస్ట్రేషన్) రామ్ ప్రకాష్ సిసోడియా గురువారం విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి నేరుగా పోర్టు గెస్ట్ హౌస్‌కు చేరుకుని అక్కడే బస చేశారు. శుక్రవారం విజయనగరం జిల్లాకు వెళ్లి.. సాయంత్రం ఆరు గంటలకు తిరిగి విశాఖ వస్తారు. అనంతరం పోర్టు గెస్ట్‌హౌస్ వద్ద ఫిర్యాదులు స్వీకరిస్తారు. 17న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లాలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని.. అక్కడ ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

### 18న నీతి ఆయోగ్ సభ్యుడి రాక

**మహారాణిపేట:** నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వి.కె.సరస్వత్ ఈ నెల 18న విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో సాయంత్రం ఆరు గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుంటారు. 19న రుషికొండలో జరిగే సదస్సులో పాల్గొంటారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు తిరిగి ఢిల్లీ వెళతారు.

### పలు రైళ్ల గమ్యం కుదింపు

**తాటిచెట్లపాలెం:** కేకే లైన్, నౌపడ-గుణుపూర్ లైన్లలో జరుగుతున్న పలు ఆధునికీకరణ పనుల కారణంగా పలు రైళ్లు ఆయా తేదీల్లో దంతేవాడ వరకే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖ-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ గురువారం నుంచి 21వ తేదీ వరకు, కిరండూల్-విశాఖ (08552) పాసింజర్ స్పెషల్ శుక్రవారం నుంచి 22వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి. విశాఖ - కిరండూల్(18514)నైట్ ఎక్స్‌ప్రెస్ గురువారం నుంచి 21వ తేదీ వరకు, కిరండూల్-విశాఖ (18513) ఎక్స్‌ప్రెస్ శుక్రవారం నుంచి 22వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి. ఈ తేదీల మధ్య దంతేవాడ-కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు. అలాగే 17న విశాఖ-గుణుపూర్-విశాఖ (08522/08521) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ శ్రీకాకుళం రోడ్ వరకే నడుస్తుంది.

# జయ జయ జయహే..

- వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు
- త్రివర్ణ శోభితంగా మారిన నగరం



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్




జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్. **చిత్రంలో** కలెక్టర్ హరేందిర ప్రసాద్, జాయింట్ సీపీ ఫకీరప్ప తదితరులు



రైల్వే స్టేడియంలో సాంస్కృతిక ప్రదర్శన




మార్చ్‌పాస్ట్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రతిభా పురస్కారాల ప్రదానం 8లో

## జిల్లా అభివృద్ధిలో భాగస్వాములవుదాం

- మాదకద్రవ్యాల రహిత విశాఖని నిర్మిద్దాం
- రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

**సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట:** పేదరికం నుంచి విముక్తి పొందినప్పుడే సమరయోధుల కలలు నిజమై.. దేశానికి అసలైన స్వాతంత్ర్యం వచ్చినట్లని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పోలీస్ పరేడ్ మైదానంలో గురువారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పరేడ్‌ను తిలకించి.. కలెక్టర్ హరేందిర ప్రసాద్, జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్పతో కలిసి గౌరవ వందనం చేశారు. పరేడ్ కమాండర్ మార్చ్‌పాస్ట్ నిర్వహించి.. విశ్రామ్‌కు చేరుకున్నారు. పోలీసు రక్షక దళాలు, ఎన్‌సీసీ క్యాడెట్లు, స్కౌట్ విద్యార్థుల మార్చ్‌పాస్ట్ అనంతరం మంత్రి సత్యప్రసాద్ మాట్లాడారు. సమాజంలో అందరు సమానంగా ఎదుగుతూ విద్య, వైద్య సేవలు సంపూర్ణంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల్ని నిర్మూలించి.. డ్రగ్స్ రహిత విశాఖగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడంలో ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్సీలు చిరంజీవిరావు, రామారావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, జేసీ మయూర్ అశోక్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, పలువిభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని స్వాతంత్ర్య సమోరయోధులు, పద్మ అవార్డు గ్రహీతలు, సీనియర్ అధికారులను మంత్రి ఆత్మీయంగా పలకరించారు.

## అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు




పోలీస్ పరేడ్ మైదానంలో అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

**వే**డుకల్లో భాగంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హర్ ఘర్ తిరంగా థీమ్ అనంతరం.. పద్మనాభం కేజీబీవీకి చెందిన 30 మంది విద్యార్థులు ప్రదర్శించిన సారే జహాసే అచ్చా, మేహాద్రి గెడ్డ డా.బి.ఆర్.అంబేడ్కర్ గురుకులానికి చెందిన విద్యార్థులు 'హర్ ఘర్ తిరంగా' నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కణితి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పుణ్యభూమి నాదేశం, జ్ఞానాపురం ఎయిడెడ్ స్కూల్‌కి చెందిన 100 మంది విద్యార్థులు ఏ శకునీ ఆడని జూదం నృత్య ప్రదర్శన, సిరిపురం బాలభవన్ స్కూల్‌కి చెందిన 32 మంది విద్యార్థులు మా తెలుగు తల్లి, నడుపూరు జెడ్పీ హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు జనగణమన, గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్‌కి చెందిన 50 మంది విద్యార్థినులు ఒకే ఒక దేశం నృత్యాలు అద్భుతంగా సాగాయి. బి.వి.కె.కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన 60 అడుగుల మువ్వన్నెల జెండా ఈ కార్యక్రమంలో హైలెట్‌గా నిలిచింది. సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం విద్యార్థులకు అవార్డులు అందించారు. జీవ వైవిధ్యంలో యువత పాత్ర, నషా ముక్తా భారత్ అభియాన్‌పై నిర్వహించిన పోటీ ల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంత్రి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.



అద్భుత విన్యాసం



ఉప్పొంగిన జాతీయ భావం



మూడు రంగుల్లో ముచ్చటగా బాలలు



## వికసిత భారత్‌కు కృషి చేద్దాం

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

**డాబాగార్డెన్స్:** 2047 నాటికి సంపూర్ణ వికసిత భారతదేశంగా ఆవిర్భావానికి అందరం కృషి చేద్దామని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ పిలుపునిచ్చారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమశిక్షణతో కూడిన విద్యను అందించిన నాడే.. ఉత్తమ పౌరులుగా దేశ ప్రగతికి తోడ్పడతారన్నారు. అనంతరం జీవీఎంసీ కార్యదర్శి పల్లి నల్లనయ్య రచనా సహకారంతో రూపొందించిన 'సకాలంలో పన్నులు చెల్లించండి'.. 'క్లీన్ అండ్ గ్రీన్ విశాఖ' దృశ్య రూపకాలను మాధవధార హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించారు. కప్పరాడ, రేసపువానిపాలెం జీవీఎంసీ బాల్యం సెంటర్ల విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. జీవీఎంసీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 279 మందికి కమిషనర్ ప్రశంసా పత్రాలు అందజేశారు.

## కర్బన ఉద్గారాల వినియోగం సున్నా స్థాయికి..



పోర్టు స్టేడియంలో జెండాకు వందనం చేస్తున్న పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు

**సీతంపేట :** అమృత్‌కాల్-2047 ప్రణాళికలో భాగంగా కర్బన ఉద్గారాల వినియోగం సున్నా స్థాయికి తెచ్చేందుకు కట్టుబడి ఉన్నట్టు పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు పేర్కొన్నారు. విశాఖ పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన జెండా ఎగురవేశారు. పోర్టు సీఐఎస్ఎఫ్ విభాగం నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోర్టు అథారిటీ చేపడుతున్న అభివృద్ధి పనుల్లో విశాఖవాసులకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ, రైల్వేతో కలిసి సుమారు రూ.300 కోట్లతో వివిధ ప్రాజెక్టులు చేపట్టినట్టు తెలిపారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, అవార్డులు అందజేశారు.

## రైల్వేకు రికార్డు స్థాయిలో ఆదాయం



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

**తాటిచెట్లపాలెం:** వాల్తేర్ డివిజన్ గత ఆర్థిక సంవత్సరంలో 10,268.72 కోట్ల ఆదాయాన్ని ఆర్జించి రికార్డు సృష్టించిందని వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం సౌరభ్ తెలిపారు. రైల్వే గ్రౌండ్స్‌లో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రైల్వే భద్రతా దళం, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సివిల్ డిఫెన్స్ సభ్యుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్పీఎఫ్ సిబ్బంది బైక్ విన్యాసాలు అద్భుతంగా సాగాయి.



స్టీల్‌ప్లాంట్‌లో డాగ్ స్క్వాడ్ ప్రదర్శన

## గత ఐదేళ్లలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి

రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు



వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయ ఆవరణలో జెండా ఆవిష్కరిస్తున్న రాజ్యసభ ఎంపీ గొల్ల బాబూరావు, మాజీ మంత్రి అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ ముఖ్య నేతలు

**కొమ్మాది:** గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని, అయితే 2024లో వైఎస్ జగన్‌ను ఎందుకు ఎన్నుకోలేదని ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరిగింది. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి కొంత సమయం ఇస్తున్నామని, ఈలోగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుంటే ప్రజలతో కలసి ఉద్యమాలు చేస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొత్స సత్యనారాయణ విజయం వెనుక నిలబడ్డ ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్వాతంత్ర్యం పోయి రెండు నెలలు పూర్తయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సంక్షేమం కాస్త సంక్షోభంలో పడిందన్నారు. ఇప్పటి వరకు 30కి పైగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు హత్యకు గురయ్యారని వాపోయారు. భోగాపురంలో ఎయిర్‌పోర్టు, రాష్ట్రంలో 16 మెడికల్ కళాశాలలు, పోర్టులు తమ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసి అభివృద్ధి చేస్తే కూటమి ప్రభుత్వం ఏదో చేసినట్లు సంబరాలు చేస్తోందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు భయపడే ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి తప్పుకున్నారన్నారు.

పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు రమేష్ నిర్వహణలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో డిప్యూటీ రీజినల్ కో-ఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మళ్ల విజయ్ ప్రసాద్, తైనాల విజయ్‌కుమార్, ఏఎస్ రెహ్మాన్, చింతలపూడి వెంకటరామయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, రొంగలి జగన్నాథం, పేర్ల విజయ్‌చందర్, పి.వి.ఎస్.ఎన్ రాజు, జాన్ వెస్లీ, పిల్లా సుజాత సత్యనారాయణ, నడింపల్లి కృష్ణంరాజు, దేవర మార్కండేయులు, అల్లంపల్లి రాజాబాబు, జహీర్ అహ్మద్, జగ్గుపల్లి అప్పలరాజు, చిన్నాదాస్, కృపా జ్యోతి, అప్పన్న, వానపల్లి ఈశ్వరరావు, శివరామకృష్ణ, బొండా ఉమామహేశ్వరరావు, అప్పలస్వామినాయుడు, శంకర బద్దల ప్రసాద్, బిపిఎన్ కుమార్ జైన్, షరీఫ్, కాళిదాస్ రెడ్డి, రామన్నపాత్రులు, విక్టర, నాగేంద్ర, జహీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్లకు శ్రావణ శోభ



పువ్వుల కొనుగోలుకు కిక్కిరిసిన జనాలు



పూర్ణామార్కెట్‌లో సందడి

- పెరిగిన పండ్లు, పువ్వుల ధర
- కిక్కిరిసిన పూర్ణామార్కెట్
- బంగారం దుకాణాల కిటకిట



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు

**జగదాంబ :** నగరంలోని మార్కెట్లు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. శుక్రవారం నిర్వహించే వరలక్ష్మీ వ్రతం కోసం అవసరమైన పూజా సామగ్రిని కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో పూర్ణామార్కెట్, రైతు బజార్లు కిటకిటలాడాయి. ఎటుచూసినా కోలాహల వాతావరణం నెలకొంది. అయితే పూలు, పండ్లు, తదితర పూజా సామగ్రి ధరలు అమాంతం పెరిగాయి. నిన్నమొన్నటి వరకు ఆపిల్ కిలో రూ.200 నుంచి రూ.250 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.300కు చేరింది. దానిమ్మ కిలో రూ.150 నుంచి రూ.200 వరకు చేరుకుంది. నల్లద్రాక్ష కిలో రూ.300కు విక్రయించారు. జామకాయలు కిలోరూ.80, అరటి పండ్లు డజను రూ.60 నుంచి రూ.100కి, బత్తాయి పళ్లు కిలో ధర రూ.80 నుంచి రూ.150కు అమ్మకాలు జరిగాయి. మరోవైపు బంతి, చామంతి, గులాబీ పూలది కూడా అదే దారి. 50 గ్రాముల బంతి, చామంతి పూలను రూ.150కి పైగా విక్రయించారు. పసుపు, కుంకుమ, అగరొత్తులు ధరలు కూడా ఒక్కసారిగా పెరిగిపోయాయి. కొబ్బరికాయ చిన్నది రూ.30, పెద్దది రూ.40 నుంచి రూ.50 పలికాయి. బంగారు దుకాణాలు కూడా కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.



రాష్ట్ర మంత్రి అనగాని సత్య ప్రసాద్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జాయింట్ సీపీ ఫకీరప్ప నుంచి ప్రశంసా పత్రం స్వీకరిస్తున్న జేసీ కె.మయూర్ అశోక్, త్రీ టౌన్ ఏఎస్ఐ ఒమ్మి శ్రీనివాసరావు, ద్వారకానగర్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కేఎన్‌వీఎస్ ప్రసాద్, డీఆర్వో మోహన్‌కుమార్, డీఎంహెచ్‌వో కె.జగదీశ్వరరావు, వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, జిల్లా ఆడిట్ అధికారి డి.డి.జె.ముల్లర్, డీఎస్‌వో జి.సూర్యప్రకాశరావు, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ పీడీ మాధవి, డీఈవో చంద్రకళ, ఎస్ఎస్ఏ పీవో శ్రీనివాసరావు

# ప్రతిభా పురస్కారాల ప్రదానం

వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 416 మంది అధికారులు, ఉద్యోగులకు స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని మంత్రి చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావుకి మహోన్నత సేవా పతకం, త్రీటౌన్ ఏఎస్ఐ ఒ.శ్రీనివాసరావుకి ఉత్తమ సేవా పతకంతో పాటు ఆరుగురికి సేవా పతకాలు బహూకరించారు. ప్రభుత్వ రంగ సంస్థలైన విశాఖపట్నం పోర్టు అథారిటీ, ఆర్ఐఎన్ఎల్, హెచ్‌పీసీఎల్, గంగవరం పోర్టు, ఐవోసీఎల్, డివీస్ లేబొరేటరీస్, కోరమాండల్ ఫెర్టిలైజర్స్‌కు అవార్డులు ప్రదానం చేశారు. మొత్తంగా 433 మందికి ప్రశంసాపత్రాలు అందించారు.



వీఎంఆర్డీఏ చీఫ్ ఇంజినీర్ భవానీశంకర్, విమ్స్ డైరెక్టర్ రాంబాబు, జిల్లా క్రీడాధికారి జూన్ గాలియట్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, పర్యటక శాఖ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి జయదేవి, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వై.శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ సీఈవో పోలినాయుడు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్, భీమిలి డీఎల్‌డీవో లక్ష్మీపతి



గోపాలపట్నం క్రైం ఏఎస్ఐ ఎస్.గోవిందమ్మ, దేవదాయశాఖ ఉప కమిషనర్ సుజాత, విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఉప కలెక్టర్ సీతారామ్మూర్తి, వీఎంఆర్డీఏ ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, కె.ఆర్.ఆర్.సి ఉప కలెక్టర్ శేష శైలజ, జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ అఖిల, కేజీహెచ్ జూనియర్ అసిస్టెంట్ నూకరాజు, కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ వి.ఎన్.ఆర్.కృష్ణ, కలెక్టర్ పీఎస్ దాట్ల రాజేంద్ర వర్మ, కలెక్టరేట్ ప్రోటోకాల్ డిప్యూటీ తహసీల్దార్ సుధీర్‌బాబు



డీపీఆర్‌వో ఆఫీసు సబార్డినేట్ ఖాదర్ బాబా, కలెక్టరేట్ డిప్యూటీ తహసీల్దార్ నరసింహ మూర్తి, డీపీఆర్‌వో డివిజనల్ పీఆర్వో నారాయణరావు, జిల్లా గృహ నిర్మాణ సంస్థ అసిస్టెంట్ ఇంజినీర్ నాయుడు, రవాణా శాఖ ఏఎంవీఐ శిరీషా దేవి, రవాణా శాఖ ఎంవీఐ సుమన్ కుమార్, రవాణా శాఖ ఏఎంవీఐ శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విస్తరణాధికారి నాగభూషణరావు



భువనేశ్వర్: ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్ నుంచి ప్రశంసా పత్రం స్వీకరిస్తున్న మర్రిపాలెం ఆర్పీఎఫ్ పోస్ట్ కానిస్టేబుల్ ఈశ్వరరావు



అమరావతి: విజయవాడలో సీఎం చంద్రబాబు నుంచి ఐపీఎం మెడల్ అందుకుంటున్న ఎస్ఐ సూరిబాబు



## ఉక్కుకు పెరిగిన డిమాండ్

ఉక్కునగరం: దేశ వ్యాప్తంగా ఉక్కుకు గణనీయంగా డిమాండ్ పెరిగిందని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్ అన్నారు. ఉక్కు త్రిష్ణా మైదానంలో జరిగిన స్వాతంత్య్ర దిన వేడుకల్లో పాల్గొని జెండాను ఆవిష్కరించారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించి మాట్లాడారు. ఈ ఏడాది మేలో స్టీల్‌ప్లాంట్ పరిస్థితిని ఉక్కు మంత్రిత్వశాఖ సమీక్షించిందన్నారు. ఉత్పత్తి పెరుగుదల, ఖర్చులను తగ్గించడం, ఆర్థిక రాబడిలో మెరుగుదల విధానాలను అవలంబించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్‌కు చెందిన ఫైర్ ఫైటింగ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, రైఫిల్ రిఫ్లెక్స్ షూటింగ్ టీమ్‌ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

## డీసీఐ లక్ష్యం రూ.2 వేల కోట్లు

సాక్షి, విశాఖపట్నం: 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.2 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(డీసీఐఎల్) చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా డీసీఐ ప్రధాన కార్యాలయంలో ఎండీ హోదాలో తొలిసారిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన దూబే.. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ 50 ఏళ్ల చరిత్రలో అధిగమించిన మైలు రాళ్లను వివరించారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన 12000 హాపర్ కెపాసిటీతో కూడిన బీగల్ సిరీస్ డ్రెడ్జర్‌ను గోదావరి పేరుతో డీసీఐలోకి రావడం చరిత్రాత్మకమన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన టీమ్‌లకు ప్రత్యేక పురస్కారాలు అందజేశారు.



డ్రెడ్జింగ్ టీమ్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న డీసీఐ ఎండీ దుర్గేష్‌కుమార్ దూబే

## నేటి నుంచి జూడాల సమ్మె

మహారాణిపేట: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై లైంగిక దాడి, హత్య నేపథ్యంలో జూనియర్ వైద్యులు, విద్యార్థులు ఆందోళన ఉధృతం చేయాలని నిర్ణయించారు. శుక్రవారం నుంచి కేజీహెచ్‌లో సమ్మె చేయనున్నట్టు ఆంధ్రా మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్ ప్రకటించారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. గురువారం జూనియర్ వైద్యులు విధులు బహిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పృథ్వీరాజ్, ఉపాధ్యక్షుడు ఆర్.ఊహ, కార్యదర్శి వివేక్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సంయుక్త పాల్గొన్నారు.

## శ్యామ్ జవేరిలో శ్రావణం ఆఫర్లు

బీచ్‌రోడ్డు: మంచుకొండ శ్యామ్ జవేరి 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని.. ఈ శ్రావణ మాసాన్ని మరపురానిదిగా మార్చేందుకు అద్భుతమైన ఆఫర్లు అందుబాటులోకి తెచ్చినట్టు యజమాని మంచుకొండ మౌళీ కృష్ణ వెల్లడించారు. తమ విలువైన కస్టమర్లకు అత్యుత్తమ ఆభరణాలను అందించాలనే ఉద్దేశంతో ఈ ఆఫర్లను రూపొందించినట్లు తెలిపారు. స్టాండ్ అవుట్ డీల్‌లో భాగంగా బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.350 తగ్గింపు ఇస్తున్నట్లు వెల్లడించారు. గోల్డ్ డిస్కౌంట్‌తో పాటు 5 శాతం నుంచి ప్రారంభమయ్యే వేస్టేజ్‌తో ప్రత్యేక కౌంటర్‌లో నో–స్టోన్ ధరను కూడా ఉపయోగించుకోవచ్చు. ఈ ఆఫర్లు సున్నితమైన రాతితో నిండిన ఆభరణాలను సొంతం చేసుకోవడానికి అద్భుతమైన అవకాశమని వివరించారు.

## మిస్ క్వీన్ ఏపీగా పూజిత

బీచ్‌రోడ్డు: మిస్ క్వీన్ ఆంధ్రప్రదేశ్‌గా విశాఖకు చెందిన పూజిత దేవులపల్లి కిరీటం దక్కించుకున్నారు. కోయంబత్తూరులో మిస్ సౌత్ ఇండియా పోటీలు జరిగాయి. పూజిత మిస్ వైజాగ్ 2017 విజేత. ఈ సందర్భంగా పూజితను పలువురు అభినందించారు.



కిరీటంతో పూజిత

## సముద్రంలో యువకుడి గల్లంతు

బీచ్‌రోడ్డు: సముద్రంలో యువకుడు గల్లంతయ్యాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బిహార్‌కు చెందిన ఏడుగురు లంకెలపాలెంలో ఓ కంపెనీలు ఉద్యోగం చేస్తున్నారు. గురువారం ఆర్కేబీచ్‌కొచ్చిన ఏడుగురు స్నానాలు చేస్తుండగా అలల ఉధృతికి ఖాసీం హైదర్ (20) కొట్టుకుపోయాడు. మిగిలిన వారంతా కేకలు వేయగా..బీచ్ పోలీసులు అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అయినా యువకుడి ఆచూకీ లభించలేదు.

## లక్ష్యాలను చేరుకోవాలి

మహారాణిపేట: రానున్న రోజుల్లో ఐఐటీ, ఎన్ఐటీల్లో విశాఖ విద్యార్థులే టాపర్‌గా నిలవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ విద్యార్థులకు పిలుపు నిచ్చారు. 10వ తరగతిలో 575కు పైగా మార్కులు సాధించిన వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 62 మంది విద్యార్థులను కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సాధనకు కృషి చేయాలన్నారు. పోటీ ప్రపంచంలో బాగా చదువుకుంటేనే రాణించగలరన్నారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, జవహర్ నవోదయ వైస్ ప్రిన్సిపాల్ శరత్ చంద్రకీర్తి, విశాఖ వ్యాలీ ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

## • కలెక్టరేట్‌లో..



కలెక్టర్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

## • అమర వీరులకు ఘన నివాళి



అమరులైన వీర సైనికులకు తూర్పు నావికాదళం నివాళులర్పించింది. బీచ్‌రోడ్డులోని విక్టరీ ఎట్ సీ వద్ద నేవల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్, వైస్ అడ్మిరల్ జి.శ్రీనివాసన్ పూలమాల వేసి అంజలి ఘటించారు.

## • వీసీటీపీఎల్‌లో..

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం కంటైనర్ ప్రైవేట్ లిమిటెడ్(వీసీటీపీఎల్)లో టెర్మినల్ హెడ్ కెప్టెన్ సుదీప్ బెనర్జీ జాతీయ జెండాన్ని ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా 27 మందితో గార్డ్ ఆఫ్ హానర్‌ని స్వీకరించారు.



గార్డ్ ఆఫ్ హానర్ స్వీకరిస్తున్న టెర్మినల్ హెడ్ కెప్టెన్ బెనర్జీ

## • వీఎంఆర్డీఏలో..



వీఎంఆర్డీఏ కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్

## • కలెక్టర్ బంగ్లాలో..



బంగ్లాలో జాతీయ పతాకావిష్కరణ చేస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

## • రూ.600 కోట్ల ఉత్పత్తి లక్ష్యం

అక్కిరెడ్డిపాలెం: రూ.600 కోట్ల ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు భెల్ (హెచ్‌పీవీపీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.జితేందర్ రెడ్డి అన్నారు. సంస్థ సీనియర్ కార్మికుడు యు.ఆనందరావుతో కలిసి ఆయన త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. 2023–24లో రూ.327 కోట్ల రికార్డు టర్నోవర్ సాధించినట్లు వెల్లడించారు.



సీనియర్ ఉద్యోగి ఆనందరావుతో కలిసి త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేయిస్తున్న భెల్ (హెచ్‌పీవీపీ) ఈడీ జితేందర్ రెడ్డి

# పోలీసుల అత్యుత్సాహం

- కూటమి ప్రజాప్రతినిధుల కాన్వాయ్ కోసం ట్రాఫిక్ నిలిపివేత
- పందిమెట్ట జంక్షన్‌లో అంబులెన్సు కూడా దారి ఇవ్వని పోలీసులు
- మంత్రి అనగాని, ఎంపీ ఇతర ప్రజాప్రతినిధులు వెళ్లిన తరువాతే ట్రాఫిక్ క్లియర్
- పోలీసుల తీరుపై మండిపడ్డ వాహనదారులు

విశాఖ సిటీ: పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. కూటమి నేతల అడుగులకు మడుగులు ఒత్తే పనిలో నిమగ్నమయ్యారు. ప్రజల భద్రతను గాలికొదిలేసి మానవత్వం మరిచి వీర విధేయతను చాటుకోవడానికి తాపత్రయపడ్డారు. గురువారం పందిమెట్ట ప్రాంతంలో కూటమి ప్రజాప్రతినిధుల కాన్వాయ్ కోసం అంబులెన్సును సైతం ఆపేసి వారి సేవలో తరించారు. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే వాహనాలు వెళ్లినంత వరకు అంబులెన్సుకు దారి ఇవ్వకపోవడం తీవ్ర వివాదాస్పదమవుతోంది. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విశాఖకు వచ్చారు. పోలీస్ ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. అతని వెంట విశాఖ ఎంపీ భరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఇతర నేతలు ఉన్నారు. ఆ కార్యక్రమం ముగిసిన తరువాత మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు, నేతల వాహనాలన్నీ ఒకేసారి నొవోటెల్ హోటల్ వైపు కదిలాయి. దీంతో ట్రాఫిక్ పోలీసులు పందిమెట్ట జంక్షన్ వద్ద ముందే ట్రాఫిక్‌ను నిలిపివేశారు. అదే సమయంలో దసపల్లా హిల్స్ ప్రాంతం నుంచి జిల్లా పరిషత్ వైపు వెళ్లేందుకు ఒక అంబులెన్సు వచ్చింది. అప్పటికే పోలీసులు ట్రాఫిక్ నిలిపివేయడంతో అంబులెన్సుకు దారి లేకుండా పోయింది. అయితే వాహనదారులు అంబులెన్సు కోసం తమ వాహనాలను పక్కకు తప్పించి దారి ఇచ్చినప్పటికీ.. పోలీసులు మాత్రం జంక్షన్ దాటడానికి అనుమతివ్వలేదు. ఒకవైపు అంబులెన్స్ హార్న్ వినిపిస్తున్నా పోలీసులు పట్టించుకోకపోగా.. చేయి అడ్డుపెట్టి మరీ అంబులెన్సు వెళ్లకుండా ఆపడం గమనార్హం. వారి కాన్వాయ్ జంక్షన్ దాటిన తరువాతే ట్రాఫిక్‌ను వదిలారు. అప్పుడే అంబులెన్సుకు దారి క్లియర్ అయింది. ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలవాల్సిన పోలీసులు మానవత్వం మరిచి కూటమి నేతల ప్రాపకానికి పరితపించడం పట్ల స్థానిక వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ముఖ్యమంత్రి పర్యటనల సమయంలోనైనా అంబులెన్స్‌కు దారి ఇచ్చిన సందర్భాలు అనేకమున్నాయి. కానీ ఈ కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు అధికార దర్పాన్ని ప్రదర్శిస్తూ ప్రజల ప్రాణాలను గాలికొదిలేస్తున్నారన్నట్లు సుస్పష్టమవుతోంది.



పందిమెట్ట జంక్షన్ వద్ద అంబులెన్సు వెళ్లకుండా చేయి అడ్డు పెట్టి ప్రజాప్రతినిధుల కాన్వాయ్‌ను పంపిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

# చికిత్స పొందుతూ ఖైదీ మృతి

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఓ ఖైదీ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సుమారు రెండేళ్లుగా శిక్ష అనుభవిస్తూనే మరో కేసులో కూడా కోర్టు వాయిదాలకు వెళుతున్నాడు. జైల్ సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం. గాజువాక ప్రాంతం దయాల్‌నగర్‌కు చెందిన ఎం.కృష్ణప్రసాద్ (22) 2022 నవంబరు 14 నుంచి జైల్‌లో శిక్ష అనుభవిస్తున్నాడు. అతను జైల్‌కు వచ్చేసరికే గంజాయి తదితర మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. దీంతో అతను సికెల్ సెల్ అనీమియాతో కొన్నాళ్లుగా బాధపడుతున్నాడు. ఇటీవల 15 రోజులు కేజీహెచ్‌లో చికిత్స పొందాడు. ఆరోగ్యం మెరుగుపడడంతో వైద్యులు డిశ్చార్జి చేయడంతో తిరిగి జైల్‌కు తీసుకువచ్చారు. వేరే కేసుకు సంబంధించిన వాయిదాలలో భాగంగా ఈనెల 12న పోలీసులు అతనిని కోర్టుకు తీసుకువెళ్లారు. కోర్టులో వాయిదా ముగిసిన తర్వాత జైల్‌కు తరలిస్తుండగా దారిలో గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే తిరిగి కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనిపై ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కేజీహెచ్ మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచారు. జైల్ అధికారులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గురువారం ఆర్డీవో సమక్షంలో దర్యాప్తు జరిపారు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు జైల్ అధికారుల తెలిపారు. కృష్ణప్రసాద్‌పై ఐదు కేసులు ఉండగా.. నాలుగు క్లియర్ కాగా పెండింగ్‌లో ఉన్న ఒక కేసు విషయంలో కోర్టుకు వాయిదాలకు వెళ్లేవాడన్నారు.